క్లుప్తంగా

నేడు హిందూ పరిరక్షణ సమితి ర్యాలీ

తుర్కయంజాల్: బంగ్లాదేశ్‌లో హిందూవులపై దాడులకు నిరసనగా బుధవారం సాయంత్రం 4గంటల నుంచి తుర్కయంజాల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ పరిరక్షణ సమితి, యంజాల్ మున్సిపాలిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూవులు స్వచ్ఛందంగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా భీంరెడ్డి


మాట్లాడుతున్న భీంరెడ్డి

తుర్కయంజాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాగన్నగూడ అధ్యక్షుడిగా సామ భీంరెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా లయన్స్ క్లబ్ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరింప జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ రాజేష్ చౌదరి, జోన్ చైర్‌పర్సన్ ఎల్మటి వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు దాసరి సుధాకర్ రెడ్డి, పూజారి శంకరయ్య, జూపల్లి వెంకటేశ్వర్ రావు, సామ అల్వాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

తలకొండపల్లి: మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని మంగళవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీదేవి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తలకొండపల్లికి చెందిన మల్లమ్మ, ఉపాధ్యక్షురాలిగా పడకల్‌కు చెందిన స్వాతి, కార్యదర్శిగా చీపునుంతలకు చెందిన లావణ్య, కోశాధికారిగా చుక్కాపూర్‌కు చెందిన శిరిష, సహాయ కార్యదర్శిగా పెద్దూర్‌కు చెందిన స్రవంతిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యురాలు మాట్లాడుతూ సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు విజయలక్ష్మి, రాములు, సత్యనారాయణ, దీపా, అకౌంటెంట్ చెన్నయ్య, ఆపరేటర్ సుధారాణి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదిబట్ల అభివృద్ధే లక్ష్యం

మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని 13, 4, 6వార్డుల్లో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిబట్ల మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. 13వ వార్డులో సుజ్ఞానం ఇంటి నుంచి బొగిడి జంగయ్య ఇంటి వరకూ సీసీరోడ్డు, కొంగర తండా 6వ వార్డు ఫకీర్ ఇంటి నుంచి కవి అంజయ్య ఇంటి వరకూ నీటి పైపులైన్, పీర్లకొట్టం ముందు ఆంగోత్ కవిత ఇంటి ఎదుట సీసీ రోడ్డు పనులు చేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాట్టి రాములు, కోల నాగేష్, ఏఈ వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడకు చెందిన దివ్యాంగులు విష్ణువర్ధన్, జంగయ్యలకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్యాటరీతో నడిచే ఈ సైకిళ్లు దివ్యాంగులకు ఎంతగానో ఉపయోగపతాయన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల కోసం ఈ వాహనాలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్‌చౌహాన్, సిద్దాల అంజయ్య, లలితాజగన్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా హర్ ఘర్ తిరంగా



ఇబ్రహీంపట్నంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా మంగళవారం బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వన్నువాడ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర బీజేవైఎం లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించడం గర్వకారణమన్నారు. ఇది దేశ ఐక్యతకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొండ రమణారెడ్డి, జంగయ్య, తాండ్ర రవి, విజయ్, ఐలేష్, సందీప్, మహేందర్, వెంకటేశ్, శశిధర్‌రెడ్డి , శేఖర్‌రెడ్డి, నాగరాజు, రాజు, ముత్యాల అనిల్, రాఘవేందర్, ఆకుల సంతోష్, అశోక్‌లు పాల్గొన్నారు.


తలకొండపల్లి: జెండాకు వందనం చేస్తున్న అనిల్

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ప్రతిఒక్కరూ తమ ఇంటిపై హర్ ఘర్ తిరంగాలో భాగంగా జెండా ఎగురవేయాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తన ఇంటిపై అనిల్ జెండా ఎగురవేశారు. జెండాకు వందనం చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలందరూ త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలని అనిల్ పేర్కొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యమం

రజక సంఘం అధ్యక్షుడు బుచ్చయ్య

ఆమనగల్లు: రజకుల సమస్యల సాధనకు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని ఆమనగల్లు రజక సంఘం నూతన అధ్యక్షుడు నాగిళ్ల బుచ్చయ్య పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఏఎస్ఎస్ ఫంక్షన్‌హాల్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్‌చౌరస్తా వద్ద రజకసంఘం జెండాను నాగిళ్ల బుచ్చయ్య ఆవిష్కరించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో రజకసంఘం, రజక యువజన సంఘం కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జంగయ్య, అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల తిరుపతయ్య, కోశాధికారిగా పకీరా, కార్యదర్శిగా శ్రీను, ప్రచార కార్యదర్శిగా బాలయ్య సలహాదారుడిగా చందును ఎన్నుకున్నారు. రజక యువజన సంఘం అధ్యక్షుడిగా ఆనంద్, ఉపాధ్యక్షుడిగా కుమార్, పాతకోట రాజు, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కార్యదర్శిగా పర్వతాలు, సలహాదారులుగా రాజు, సాయి, జగన్, కృష్ణయ్య, కృష్ణ, నాగిళ్ల యాదయ్య, శ్రీను, కృష్ణలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని, ఆమనగల్లు ఇస్త్రీ షాపుల యజమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బుచ్చయ్య మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, సాయి, నాగిళ్ల యాదయ్య పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న బుచ్చయ్య


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై చేరిన వర్షం నీరు

ఆమనగల్లులో భారీ వర్షం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. కొన్ని రోజులుగా వర్షాలు పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు మధ్యాహ్నం కురిసిన వర్షం ఆనందం నింపింది. భారీవర్షంతో ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పలుచోట్ల నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లో మంగళవారం మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నాదర్‌గుల్ 9వ డివిజన్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ నిమ్మల సునీతతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా మల్లాపూర్ 14వ డివిజన్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెనిగె భారతమ్మతో కలిసి ఆమె ప్రారంభించారు. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్‌లలో ప్రాధాన్యతతో అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా కొనసాగిస్తున్నామని మేయర్ పారిజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నాయకులు బంగారు బాబు, బంగారు అశోక్, జెనిగె కొమురయ్య, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కవిత
- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ఆమనగల్లులో మాట్లాడుతున్న కవిత

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మహిళా విభాగం జిల్లా శ్రామిక కన్వీనర్ కవిత డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 51 వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. వీరిలో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చెందిన మహిళలే ఉన్నారన్నారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ. వెయ్యి అందజేసిందని, ఆ తరువాత రెండు వేలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు అమలు చేస్తామని ఇచ్చిన హామీని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, లక్ష్మమ్మ, మంజుల, యాదమ్మ, వరలక్ష్మి, బుజ్జమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మంచాల మండల కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఐఆర్‌పీ యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనుకోవడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడిగా కష్ట, నష్టాలు ఒర్చి పాఠశాలలో విద్యార్థులకు అన్నం వండి పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సరిత, మండల నాయకులు ఆలివేలు, రాజమ్మ, లక్ష్మమ్మ, అనిత, పెంటమ్మ, రాణి, యాదయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వెల్జాల్‌లో ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, తదితరులు

తలకొండపల్లి: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని వెల్జాల్ విద్యుత్ ఉప కేంద్రం వద్ద ఏఈ కటారియా ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ ఉప కేంద్రం పరిధిలోని వెల్జాల్, చౌదర్‌పల్లి, జూలపల్లి, వెంకటాపూర్, మాదాయిపల్లి, అంతారం గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నియంత్రికలకు తప్పనిసరిగా ఆన్‌ఆఫ్ ఏబీ స్విచ్‌లు బిగించాలని, కిందికి వ్రేలాడుతున్న తీగలను సరి చేయాలని, ప్రత్యేకంగా గ్రామాలకు విద్యుత్ లైన్స్‌లు ఏర్పాటు చేయాలని, ఉప కేంద్రంలో ఫోన్ అందుబాటులో ఉంచాలని, రాత్రి వేళల్లో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ అమ్రు, విద్యుత్ సిబ్బంది ఆయాఖాన్, రామోజీ, నాయకులు, రైతులు విష్ణువర్ధన్, అశోక్‌బాబు, అనిల్, కృష్ణయ్య, అజీజ్, అంజనేయులు, యాదగిరి, నర్సింహా, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయికిరణ్ గుప్తాకు సన్మానం


సాయికిరణ్ గుప్తాను సత్కరిస్తున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన గార్లపాటి సాయికిరణ్‌గుప్తా మొదటి ప్రయత్నంలోనే ఆర్‌అండ్‌బీ శాఖలో ఏఈగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో మంగళవారం ఏఈగా ఎంపికైన సాయికిరణ్‌గుప్తాను లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి కృష్ణయ్య, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తుక్కుగూడ: ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ 41వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, బీఆర్ఎస్ తుక్కుగూడ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, కౌన్సిలర్ సుమన్, నాయకులు బుచ్చిరెడ్డి, గడ్డి రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింగ్, నాగేశ్, రాజు, పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.21, వంకాయ రూ.40, బెండ రూ.23, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.40, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.19, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఆర్థిక సహాయం


తలకొండపల్లి: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో బుర్ర సాయన్న మంగళవారం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 3వేలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, జంగయ్య, రాజేందర్, పురుషోత్తం, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

షకీల్ కుటుంబాన్ని ఆదుకుంటాం..

షకీల్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన షకీల్ బ్రెయిన్ సర్జరీ చేయించుకుని హైదరాబాద్‌లోని ఓవైసీ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ హాస్పిటల్‌కెళ్లి షకీల్‌ను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు..

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేష్ రూ.15,000లు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ముజీబర్ రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..


కడ్తాల్: ఆర్థిక సాయం చేస్తున్న ఉమావతి

కడ్తాల్: ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన పరమేశ్ మృతి చెందిన విషయం తెలుసుకొని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఉమావతి బుగ్గయ్యగౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుటంబానికి ఆర్థిక సాయంతో పాటు, 50 కేజీల బియ్యం అందజేశారు. బాలరాజు, మల్లేశ్, మధు, వెంకటేశ్, శ్రీశైలం, మహేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నర్సింహ

ఆమనగల్లు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ కోశాధికారి నర్సింహ కోరారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఊరుకొండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నర్సింహ భార్య హైమావతి జ్ఞాపకార్థం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్, ఉపాధ్యాయులు హబీబ్‌ఉన్నీసా బేగం, ప్రసాద్‌నాయుడు, శివకుమార్, చంద్రశేఖర్, పాండయ్య, కన్నాజీ, లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాష తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఖాదీర్ తల్లి రజియాబేగం ఇటీవల మృతి చెందింది. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ బాధిత కుటుంబాన్ని సోమవారం రాత్రి పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఏనుగు జంగారెడ్డి, దేవ భాస్కర్‌రెడ్డి, ఎస్.కృష్ణనాయక్, బొక్క భూపాల్‌రెడ్డి, ఎస్.శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేఎల్ఆర్

శంకరమంచి రఘుశర్మకు సన్మానం


శంకరమంచి రఘుశర్మను సత్కరిస్తున్న సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: అమెరికాలో శ్రీసాయి దత్తపీఠం వ్యవస్థాపకులు, శంకరమంచి రఘు శర్మ హిందూ ధర్మ రక్షణ కోసం కృషి చేస్తున్నారని శృంగేరి ఆస్థాన పౌరాణికుడు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి వెల్లడించారు. దర్శనం ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సంపాదకులు మరుమాముల వెంకట రమణ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌కేపురం లోని వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో బ్రహ్మశ్రీ శంకరమంచి రఘుశర్మను సత్కరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. శంకరమంచి రఘు శర్మ అమెరికాలో సనాతన ధర్మాన్ని పరివ్యాప్తంచేస్తూ, తెలుగు వారికి ఉపాధి, వసతి, ధార్మిక సేవ చేస్తూ గౌరవ ప్రతిష్టలు పొందుతున్నారన్నారు. వెంకట రమణ శర్మ మాట్లాడుతూ.. శంకరమంచి రఘు శర్మ అమెరికాలో శివవిష్ణు దేవాలయాల సముదాయాన్ని నిర్మించి అమెరికాలో హిందువులందరి ఏకతాటిపై తెచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయశర్మ, అష్టలక్ష్మి దేవాలయం చైర్మన్ సోమా సురేష్, ఫౌండర్ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, కార్యదర్శి జగన్, ప్రత్యంగిరా దేవాలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, వేద పండితులు కాసుల చంద్రశేఖర్ శర్మ, కాసుల రాధాకృష్ణ శర్మ, కొడకండ్ల రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు.